క్లుప్తంగా

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): 'గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రత్యేక చర్యలు చేపట్టాలి' అని జెడ్పీ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం మంచి నీటి సరఫరా స్కీంలు, ఎంపీడబ్ల్యూఎస్, పీడబ్ల్యూఎస్ స్కీంలపై ఈఈలు, డీఈలకు నిర్వహించిన వర్క్‌షాపులో చైర్‌పర్సన్ పాల్గొని మాట్లాడారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఇబ్బందులు పడకుండా నీటి సరఫరాపై దృష్టి పెట్టాలన్నారు. మరమ్మతులకు గురైన బోర్లు, నీటి సరఫరా స్కీంలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. స్కీంల నిర్వహణలో విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజలకు జవాబుదారితనంగా పని చేయాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు మంచినీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ సీఈఓ చిరంజీవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో ఆర్వోలదే కీలకపాత్ర



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల నిర్వహణలో ఆర్వోల పాత్ర అత్యంత కీలకమని, వారంతా సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆర్వోలు, ఈఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 16 విభాగాల అధికారులు, సిబ్బంది కలిసి ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఆర్వోలు నాయకులుగా ముందుండి క్షేత్రస్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రకటన జారీ అయినప్పటి నుంచి ప్రతిక్షణం ఎంతో విలువైందన్నారు. రోజువారి నివేదికలను నిర్ణీత సమయంలోనే సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు శిక్షణ, పోలింగ్ విధులు నిర్వహించే సమయంలో భోజన వసతి, ఇతర సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. హ్యాండ్ బుక్ క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. ఇతర జిల్లాల నుంచి కొత్తగా వచ్చిన అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవాలను అర్థం చేసుకుని పనిచేయాలన్నారు. సమావేశంలో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, ట్రైనీ కలెక్టర్ సంజనా సింహా, అడిషనల్ ఎస్పీ సౌజన్య, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.

ఎవరూ లేని సమయం చూసి..

• ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. హరనాథపురం రెండో వీధిలో మునికృష్ణయ్య, మంజుల దంపతులు నివాసం ఉంటున్నారు. వారు తమ కుమారుడు ఎంగేజ్‌మెంట్ నిమిత్తం ఈనెల 17వ తేదీ రాత్రి హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి గ్రిల్స్‌కు ఉన్న తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.50 వేల నగదు, స్మార్ట్ ఫోన్, 68 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం మునికృష్ణయ్య కుటుంబం హైదరాబాద్ నుంచి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని నగదు, బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ మేరకు మంజుల బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎల్.వీరానాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

నెల్లూరు(బారకాసు): పలు ప్రాంతాల్లో దోమల నివారణకు తమ వంతు చర్యలు చేపట్టినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ తెలిపారు. మంగళవారం నగరంలోని పాతమున్సిపల్ కార్యాలయ సమీపంలోని కుక్కలగుంట, రాజేంద్రనగర్ ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో, ఉయ్యాల కాలువలో ఆయిల్ బాల్స్ వేయించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జగదీష్, బాబు, అలిమేలు శ్రీను, అమిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే రోల్ మోడల్

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



వలంటీర్లను సత్కరించిన ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, స్రవంతి తదితరులు

నెల్లూరు రూరల్: ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు చేర్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని రామ్మూర్తి నగర్‌లో ఉన్న మహేశ్వరి పరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. రూరల్ నియోజకవర్గంలోని 1, 2, 12, 17, 18, 19 డివిజన్లకు చెందిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో గొప్ప ఆలోచనతో సీఎం జగన్ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, రైల్వే బోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గౌరీ, బీసీ నేత హరిబాబు యాదవ్, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, కార్పొరేటర్లు నాగరాజు, రామ్మోహన్, సుధాకర్, అశోక్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివ సునీల్‌రెడ్డి, మన్నిపాడు జెట్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు లేబూరు పరమేశ్వరరెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ చైర్మన్ సునంద తదితరులు పాల్గొన్నారు.

సండే మార్కెట్ పునఃప్రారంభం



మాట్లాడుతున్న నేతాజీ సుబ్బారెడ్డి

నెల్లూరు(వేదాయపాళెం): కార్పొరేషన్ అభివృద్ధి పనుల్లో భాగంగా సండే మార్కెట్‌లో నూతన రోడ్ల నిర్మాణం చేట్టారు. దీంతో మూసివేసిన మార్కెట్‌ను మంగళవారం పునఃప్రారంభించినట్లు దాని కమిటీ అధ్యక్షుడు హఫీజుద్దీన్ తెలిపారు. మార్కెట్ గౌరవాధ్యక్షుడు కిశోర్‌బాబు మాట్లాడుతూ చెప్పులు దుకాణాలు ఉండే రోడ్డులో చిన్నపాటి వర్షానికి నీరు నిల్వ చేరేదన్నారు. అధికారులు నూతన రోడ్డు వేయడంతో దుకాణాలు ఎత్తు చేసుకునేందుకు నెలరోజులు మూసివేయాల్సి వచ్చిందన్నారు. విద్యావేత్త నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం జరగడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు చిరసాని కోటిరెడ్డి, భాషోద్యమ సమితి నాయకులు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, ప్రజా సైన్స్ వేదిక నాయకులు మాల్యాద్రి, రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి సునీత, ఏఐఎఫ్‌టీయూ నాయకులు లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి వాణి

నెల్లూరురూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కె.వాణి అన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా రూరల్ మండలంలోని నవలాకులతోట ఎస్సీ కాలనీలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సును ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు

పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు(బృందావనం): స్థానిక భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంఘం భవనంలో మంగళవారం స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి మాజీ ఎమ్మెల్సీ, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు వి.బాలసుబ్రహ్మణ్యం హాజరై మాట్లాడారు. పెన్షనర్ల సంఘాలు సంఘటితంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యమ నేత పి.బాబురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు చేపట్టే పోరాటాలకు యూటీఎఫ్ మద్దతు ఉంటుందన్నారు. ఇంకా జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ఎం గౌస్ మాట్లాడారు. ఎనెల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ సౌజన్యంతో పెన్షనర్లకు ఈసీజీ, బీపీ, షుగర్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్పీవీఎస్ మూర్తి ఉపాధ్యక్షుడు, విశ్రాంత డీఎస్పీ మస్తానయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీకాంత్, కోశాధికారి జె.హజరత్తయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్ రఘునాథ్, సభ్యులు పి.వేణు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

నెల్లూరు(బృందావనం): భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని పప్పుల వీధిలోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో జై శ్రీరామ హనుమాన్ భక్తబృందం ఆధ్వర్యంలో మంగళవారం సామూహికంగా రమాదేవి సమేత వీరవెంకటసత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. నిర్వాహకులు మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా సామూహికంగా వ్రతం నిర్వహిస్తున్నట్లు వివరించారు. అన్నవరం దేవస్థానం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన సత్యనారాయణ ప్రసాదాలను, అలాగే స్వామి చిత్రపటాన్ని భక్తులకు అందజేశారు. సహకారం అందిస్తున్న దేవస్థానం కమిటీకి, కార్యనిర్వహణాధికారి పీవీకే హేమచంద్రరావుకు భక్తబృందం ధన్యవాదాలు తెలిపింది.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం భేటీ



మాట్లాడుతున్న ముక్కురాధాకృష్ణ గౌడ్

నెల్లూరు(బారకాసు): రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర పదాధికారుల సమావేశాన్ని మంగళవారం స్థానిక మాగుంట లేఅవుట్‌లోని కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముక్కురాధాకృష్ణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాదిగా రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఉన్నారన్నారు. అలాగే వెంచర్ల యాజమాన్యాలు, బిల్డర్స్, కొనుగోలు, అమ్మకందారులు ప్రధానంగా ఉన్నారని తెలిపారు. రియల్ ఎస్టేట్‌లో రైతులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. త్వరలోనే చేపట్టబోయే కార్యక్రమాలపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనేష్ నాయుడు, కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి వెంకట సుధీర్, కార్యవర్గ సభ్యులు నరేష్ యాదవ్, పెంచలకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లికి ఘన నివాళి



జనార్దనరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి జయంతిని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇందిరాభవన్‌లో నేదురుమల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. నాయకులు పాల్గొన్నారు.

• కేంద్ర అగ్రికల్చర్ మాజీ డైరెక్టర్ కనకట్ల రఘురామ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జనార్దనరెడ్డికి నివాళులర్పించారు. ఏసీ స్టేడియం సమీపంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది.

పథకాల గురించి ట్రైనీ కలెక్టర్ ఆరా



అధికారులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్

నెల్లూరు(బారకాసు): నగరంలోని సుబేదారుపేట ప్రాంతంలో ఉన్న మెప్మా కార్యాలయాన్ని మంగళవారం ట్రైనీ కలెక్టర్ సంజనా సింహా సందర్శించారు. పథకాల గురించి ఆమె ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి.రవీంద్రతో మాట్లాడి తెలుసుకున్నారు. కార్యక్రమాల అమలు తీరును టీఈలు, సీఎంఎంల నుంచి ఆరాతీశారు. కార్యక్రమంలో ఐబీ అంకయ్య, ఎల్‌హెచ్ సుధాకర్, బీఎల్ సురేంద్ర, ఎస్ఎస్ కాంతయ్య, హెచ్ఎస్ హర్షిత, డీసీఓ రామ సుబ్బారావు, సీఎం పెంచలయ్య, శైలమ్మ, ఆర్పీలు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వేదాయపాళెం): ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ బాలికల గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ డి.కొండలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా దొరవారిసత్రంలో బాలురకు 80 సీట్లు, కోటలో బాలురకు 120 సీట్లు, గొలగమూడిలో మత్స్యకారులకు (బాలికలు) 80 సీట్లు, గూడూరులో బాలికలకు కేటాయించిన 40 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు తమ దరఖాస్తులను https/mjpapbcwreis.apcfss.in వెబ్‌సైట్‌లో మార్చి ఒకటి నుంచి 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రాథమిక పాఠశాలల్లో 2022 – 23, 2023 – 2024 విద్యా సంవత్సరంలో 3, 4 తరగతులు చదివి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా బీసీ గురుకుల పాఠశాలల్లో ఏప్రిల్ 27వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిజేశారు. పూర్తి వివరాలకు 90008 66912, 82476 98231 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట): సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ ఉద్యోగ సంఘాలు మంగళవారం ధర్నా చేశాయి. రాష్ట్ర జేఏసీ వైస్ చైర్మన్, ట్రెజరీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు శోభన్ బాబు, నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్నేపల్లి పెంచలరావు, నాయుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఎం.హరినారాయణన్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి బండారుపల్లి వెంకటేశ్వర్లు, ఆర్టీసీ నాయకులు పీఎస్ రెడ్డి, టీచర్స్ సంఘ నాయకులు సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు, వెంకటశేషులు, దశరథరామయ్య, హజరత్తయ్య, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు కోరారు. 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర' కార్యక్రమంలో భాగంగా అయ్యప్ప గుడి, వేదాయపాళెం సెంటర్ సమీపంలో, గాంధీ నగర్ వాటర్ ట్యాంక్ వద్ద మంగళవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అర్హులైన వారికి రిజిస్ట్రేషన్, ఆధార్ అప్డేట్, పీఎం స్వనిధి పథకం, ముద్రలో తదితర అంశాలపై అవగాహన కల్పించామని చెన్నుడు తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీజేపీ ప్రతినిధులు శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జున, కృష్ణ, హరికుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, నగరపాలక సంస్థ ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయిసూరి తదితరులు పాల్గొన్నారు.

పేదింట పెళ్లికి ప్రభుత్వ సాయం



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ తదితరులు

వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలకు సంబంధించిన ఆర్థిక సాయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఎం.హరినారాయణన్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి హాజరయ్యారు. ప్రభుత్వ సాయం అందుకోవడం ఆనందంగా ఉందని లబ్ధిదారులు తెలిపారు.

– నెల్లూరు(దర్గామిట్ట)

జగనన్నకు రుణపడి ఉంటాం



షాదీ తోఫా పథకం ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. నా భర్త రేషన్ బియ్యం వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ప్రతి నెలా ప్రభుత్వం జీతం ఇస్తుంది. మా అత్తమ్మకు ప్రతి నెలా పింఛన్, ఇంకా చేయూత వంటి పథకాలు అందుతున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆనందాన్ని రెట్టింపు చేసిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– షేక్ షాజిదా, రంగనాయకులపేట, నెల్లూరు

సంతోషంగా ప్రతి కుటుంబం



నేను ఓ ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్నాను. జగనన్న సీఎం అయిన తర్వాత ప్రతి కుటుంబంలో సంతోషం రెట్టింపు అయింది. లంచాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయి. నాకు ఎవరు చుట్టూ తిరగకుండానే రూ.లక్ష కళ్యాణమస్తు పథకం ద్వారా అందించారు. జగనన్నే మళ్లీ సీఎం కావాలి. పేదల జీవితాల్లో వెలుగులు కొనసాగాలి.

– దామెర్ల కమల, గంగవరం, కోవూరు మండలం

130 మందికి ఇంటి పట్టాల పంపిణీ



ఇంటి పట్టాను అందజేస్తున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 7వ డివిజన్‌కు సంబంధించి జాఫర్‌సాహెబ్ కాలువ, వీవర్స్ కాలనీ, నాగేంద్రనగర్, సాయిబులపాళెం ప్రాంతాలకు చెందిన 130 మంది లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ సిటీ నియోజకవర్గ సమన్వయకర్త ఎండీ ఖలీల్ అహ్మద్ మంగళవారం ఇంటింటికీ వెళ్లి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఇచ్చిన మాట ప్రకారం కాలువగట్లపై నివాసం ఉంటున్న కుటుంబాలకు ఇంటి పట్టాలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. దీంతో లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కిన్నెర ప్రేమ్‌కుమార్, ఏడో డివిజన్ ఇన్‌చార్జి కిన్నెర ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భీష్మ ఏకాదశి పూజలు

నెల్లూరు(బృందావనం): భీష్మ ఏకాదశి సందర్భంగా రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. తిరుమంజనం, పూజలు, గరుడసేవ పేట ఉత్సవం విశేషంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా తంగిరాల వెంకటసుబ్బయ్య వారసులు వ్యవహరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సభ్యులు వీరేపల్లి పద్మజ, వేలూరు శ్రీనివాసులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వేదగిరిపై..

నెల్లూరు రూరల్: రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం భీష్మ ఏకాదశిని నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యుల పర్యవేక్షణలో రాత్రి లక్ష తులసీ పూజను చేశారు. స్వామి కల్యాణం, గిరి ప్రదక్షిణ ఉత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది.



రంగనాథుడికి గరుడసేవ ఉత్సవం



నరసింహకొండపై పూజలు

ఓటర్ల జాబితాపై అపోహలు వద్దు

• కమిషనర్ వికాస్ మర్మత్




మాట్లాడుతున్న కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ఓటర్ల జాబితాపై ఎలాంటి అపోహలు వద్దని ఈఆర్వో, కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. 2024వ సంవత్సరానికి సంబంధించిన నెల్లూరు సిటీ–117 నియోజకవర్గం ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డబుల్ ఎంట్రీలు ఉన్నాయని వాటికి సంబంధించి ఫారాలను దాఖలు చేస్తామని రాజకీయ పార్టీల ప్రతినిధులు కమిషనర్‌కు తెలియజేశారు. అందుకు వికాస్ మర్మత్ జవాబిస్తూ అధికారుల చేత విచారణ చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా రాజకీయ పార్టీలు సూచించిన అభ్యంతరాలపై క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. డబుల్ ఎంట్రీ, డోర్ నంబర్ లేని ఓటరు జాబితాలపై బీఎల్వోలతో పర్యవేక్షించామన్నారు. అంభ్యంతరాలుంటే ఆయా పోలింగ్ స్టేషన్ల బీఎల్వోల సమక్షంలోనే పరిశీలించేలా ఆదేశాలిచ్చామన్నారు. సమావేశంలో ఏఈఆర్ఓలు వెంకటేశ్వరరావు, ప్రసాద్‌రావు, డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వేణు, టీపీఓ ప్రకాష్, ఎన్నికల విభాగం చక్రపాణి పాల్గొన్నారు.

రూ.862 కోట్ల సబ్సిడీ చెల్లింపు

- 30 రోజుల్లో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు
- గతేడాదిలో 11 వేల వ్యవసాయ సర్వీసులు
- ఎస్ఈ విజయన్



మాట్లాడుతున్న జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఉమ్మడి జిల్లాకు సంబంధించి గతేడాదిలో 2.16 లక్షల వ్యవసాయ సర్వీసులకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థకు రూ.862 కోట్లను సబ్సిడీ కింద చెల్లించిందని ఏపీ ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ అన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఉన్న రైతులు నూతనంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసులు కావాలంటే సచివాలయాల్లో జగనన్న రైతు నేస్తం పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వారంలోపు సంబంధిత విద్యుత్ అధికారి సర్వీసు కనెక్షన్ కోసం ఎంత చెల్లించాలో నిర్ణయిస్తారన్నారు. ఒక కిలోవాట్‌కు రూ.1,540 సెక్యూరిటీ డిపాజిట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. 2023 సంవత్సరంలో 11,342 వ్యవసాయ విద్యుత్ సర్వీసులు ఇచ్చామన్నారు. ఈ ఏడాది రెండునెలల కాలంలోనే 3,500 వ్యవసాయ సర్వీసులు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 30 రోజుల్లోనే కనెక్షన్ ఇస్తామన్నారు. ఎలాంటి కోటా పద్ధతి లేకుండా అపరిమిత సర్వీసులు ఇస్తామని తెలియజేశారు.

• పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో భాగంగా నెలకు 150 నుంచి 300 విద్యుత్ యూనిట్లును వినియోగించే వినియోగదారులు రెండు కిలోవాట్ల వరకు సోలార్ రూఫ్‌టాప్ కెపాసిటీ కావాలనుకుంటే రూ.30 వేల నుంచి రూ.60 వేల సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని ఎస్ఈ తెలిపారు. మూడు కిలోవాట్లకు రూ.78 వేలు సబ్సిడీ రూపంలో ఇస్తామన్నారు. ఒక కిలోవాట్ సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్ ద్వారా 125 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చని 5 నుంచి 6 సంవత్సరాల్లో సోలార్ ప్యానెల్ కోసం పెట్టిన పెట్టుబడి తిరిగి పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.